ప్రజాశక్తి
గురువారం 31 జులై 2025
5
అల్లూరి సీతారామరాజు

ముమ్మరంగా విద్యుత్ పునరుద్ధరణ పనులు

రాజుపాకలో బిగిస్తున్న కొత్త ట్రాన్స్‌ఫార్మర్

ప్రజాశక్తి -అనంతగిరి : మండలంలో ఈదురు గాలులు, పిడుగు పాటుకు దెబ్బతిన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను స్థానిక విద్యుత్ శాఖ సిబ్బంది మరమ్మతులు చేసి, పునరుద్ధరిస్తున్నారు బుధవారం అనంతగిరి పంచాయతీ పరిధిలో రాజుపాక. మాలింగవలస తదితర గ్రామాల్లో పాడైన ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించి, కొత్తవాటిని అనంతగిరి సబ్‌స్టేషన్ సిబ్బంది అమర్చారు. అలాగే కాశీపట్నం, భీమవరం, పిన్నకోట విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలలో కూడా మరమ్మతులు చేస్తున్నారు. విద్యుత్ సిబ్బంది నిరంతరం శ్రమిస్తూ సమస్యల పరిష్కార చర్యలు చేపట్టడంపై గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు కార్యక్రమంలో విద్యుత్ శాఖ సిబ్బంది మధు, సురేష్, సత్యనారాయణ, ధర్మ, నారాయణ. పాల్గొన్నారు

నీటి వనరులున్నా.. తాగునీరు సున్నా..

గుక్కెడు నీటికి కటకట!

- మూలకు చేరిన నీటి పథకాలు, బోర్లు
- ఆరు నెలలుగా తాగునీటికి అవస్థలు
- గిరిజనం మొర పట్టని అధికారులు

మరమ్మతుకు గురైన మంచినీటి పథకం, పాడైన బోరు

ప్రజాశక్తి -చింతపల్లి : మండలంలోని అన్నవరం పంచాయతీ. సోమవరం గ్రామంలో తాగునీటి వనరులు సరిపడా ఉన్నా, అవన్నీ పనిచేయక చేరడంతో గుక్కెడు నీటికి గిరిజన అవస్థలు పడుతున్నారు. ఆరు నెలలుగా ఇదే పరిస్థితి ఉందని సంబంధిత ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు మొర పెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన చెందుతున్నారు. అన్నవరం పంచాయతీ సోమవరం గ్రామంలో సుమారు 80 కుటుంబాలు గిరిజనులు జీవనం సాగిస్తున్నారు. గ్రామంలో మూడు చేతి పంపులే వారికి ప్రధాన తాగునీటి ఆధారం. గత ప్రభుత్వ హయాంలో గ్రామంలో రూ.40 లక్షల వ్యయంతో రెండు నీటిట్యాంకులు నిర్మించారు. దాంతో చేతి పంపుల వాడకం తగ్గింది. ఫలితంగా అవి మూలకు చేరిపోయాయి. ఇదే సమయంలో ఆరు నెలల క్రితం వాటర్ ట్యాంక్‌లు మరమ్మతులకు గురికావడంతో సోమవరం వాసులకు తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. మూలకు చేరిన బోర్లు బాగుచేయాలని ప్రయత్నించినా, రెండు పనిచేయడం లేదు. రెండు నీటి పథకాలు మరమ్మతులకు గురై నీరివ్వని పరిస్థితి ఉంది. దీంతో అందుబాటులో ఉన్న ఒకే ఒక్క చేతి పంపు నీరే వారికి ఆధారంగా మారింది. గ్రామంలో మూడు బోర్లు, రెండు తాగునీటి పథకాలున్నా అవి పనిచేయకపోవడంతో తాగునీటికి అవస్థలు పడుతున్నామని సోమవరం గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయాన్ని చింతపల్లి ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు ఆరు నెలల క్రితమే చెప్పినా, నేటికీ వారి జాడ కానరాలేదని, పంచాయతీ పాలకవర్గం కూడా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి, సోమవరం గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని వేడుకుంటున్నారు.

సోమవరంలో ఏకైక బోరు వద్ద మహిళల పడిగాపులు

9లోగా ప్రత్యేక డిఎస్‌సి ప్రకటించాలి

- 1న చింతపల్లిలో జీపుజాతా ప్రారంభం
- 8న పాడేరు ఐటిడిఎ వద్ద మహాధర్నా

మాట్లాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం నేత సన్నిబాబు

ప్రజాశక్తి- పెదబయలు : వచ్చేనెల 9న, ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలోగా రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసీ ప్రత్యేక డిఎస్‌సిపై ప్రకటన చేసి, జారీ చేయాలని ప్రత్యేక డిఎస్‌సి సాధన కమిటీ డిమాండ్ చేసింది. బుధవారం మండల కేంద్రంలోని గిరిజన ఉద్యోగుల భవనంలో ఆదివాసి స్పెషల్ డిఎస్‌సి సాధన కమిటీ, ఆదివాసీ నిరుద్యోగులు సంఘం ఆధ్వర్యంలో, సంఘం జిల్లా కోకన్వీనర్ మాధవరావు అధ్యక్షతన డిఎస్‌సి నిరుద్యోగ అభ్యర్థుల సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా పూర్వ అధ్యక్షులు బొండా సన్నిబాబు మాట్లాడుతూ ఆదివాసి స్పెషల్ డిఎస్‌సి సాధన కమిటీ ఆధ్వర్యంలో కొన్నాళ్లుగా చేస్తున్న ఉద్యమాలకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించి, మే 13, ముఖ్యమంత్రి చంద్రబాబు చర్చలకు పిలిచి, ఆదివాసి ప్రాంతంలో 100శాతం ఉద్యోగాలు గిరిజనులకే కేటాయిస్తామని హామీ ఇచ్చారన్నారు. మెగా డిఎస్‌సిలో ఏజెన్సీలోని పోస్టులను మినహాయించి, ప్రత్యామ్నాయ జిఓ ద్వారా ఆయా ఉద్యోగాలను వందశాతం గిరిజనులతోనే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు

గిరిజన నిరుద్యోగుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలన్న డిమాండ్‌తో వచ్చేనెల ఒకటి నుంచి చింతపల్లిలో జీపుజాతా ప్రారంభమై, 8వ తేదీకి పాడేరు చేరుకుని అక్కడ ఐటిడిఎ వద్ద మహాధర్నా నిర్వహిస్తామన్నారు. 9లోగా ఆదివాసి ప్రాంతాల్లో వంద ఉద్యోగాలు గిరిజనులకే కేటాయిస్తామని, స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ ఇస్తామని ప్రకటించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సాధన కమిటీ జిల్లా కన్వీనర్ సాగిన ధర్మన్న పడాల్ పరిశీలకులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదివాసీ నిరుద్యోగుల సంఘం మండల కమిటీ 13 మందితో ఏర్పాటు చేశారు. మండల కన్వీనర్‌గా జె చలపతి, కోకన్వీనర్లుగా బి మచ్చ, కొండపడాల్, వినయ్ కుమార్ దిలీప్, కృష్ణవేణి, కమిటీ సభ్యులుగా సత్యారావు, కుమారస్వామి, బాలరాజు, కొండబాబు, కమలాకర్ రావు, శివకుమార్, కృష్ణ, రాజేశ్వరిలను ఎన్నుకున్నారు.

జి మాడుగుల : జిఒ 3 ప్రయోజనాలను పునరుద్ధరించి, ఏజెన్సీలో శతశాతం ఉద్యోగాలు గిరిజనులకే చెందేలా ప్రత్యేక డిఎస్‌సి నోటిఫికేషన్ జారీ చేయాలని డిఎస్‌సి సాధన కమిటీ కన్వీనర్ సాగిన సింహాచలం, కో కన్వీనర్ వంతల రాజంనాయుడు కోరారు. బుధవారం మండలం కేంద్రంలోని రెయిన్‌బో కార్నర్ వద్ద డిఎస్‌సి నిరుద్యోగ అభ్యర్థుల ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సిఎం చంద్రబాబు, కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ఆగస్టు ఒకటి నుంచి చింతపల్లిలో జీపుజాతా ప్రారంభమై, 8న పాడేరు ఐటిడిఎ వద్ద మహాధర్నాతో ముగుస్తుందన్నారు. ఈ లోగాప్రభుత్వం స్పందించి, జిఒ3, ఆదివాసీ ప్రత్యేక డిఎస్‌సిపై ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. .కార్యక్రమంలో జిఒ 3 సాధన కమిటీ సహాయ కార్యదర్శి మత్స్యరాస నారాయణరాజు, పీసా కమిటీ మండల అధ్యక్షులు లకే రామకృష్ణ, ఎం.గణేష్, సాగిన రాజు, కొటారి చంటిబాబు, కొటారి సత్యనారాయణ, కిల్లంకి వరప్రసాద్, పాంగి హేమంత్ కుమార్, కామేష్ పాల్గొన్నారు.

ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న ప్రత్యేక డిఎస్‌సి సాధన కమిటీ నేతలు

ఆది కర్మయోగి గ్రామ విజన్ మ్యాప్ సిద్ధం చేయండి

జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

జిల్లా అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి -పాడేరు: విద్య, ఆరోగ్యం, తాగునీరు, జీవనోపాధి, అటవీ ఉత్పత్తుల వ్యాపారం వంటి అంశాలపై అభివృద్ధి చేయడమే లక్ష్యంగా గిరిజనాభివృద్ధికి కేంద్ర గిరిజన వ్యవహారల మంత్రిత్వ శాఖ ఆది కర్మయోగి రెస్పాన్సివ్ గవర్నెన్స్ నేషనల్ మిషన్‌ను దేశవ్యాప్తంగా అమలు చేస్తోందని జిల్లా కలెక్టర్ కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆదికర్మ యోగి కార్యక్రమం అమలుపై జిల్లా అధికారులకు వివరించారు. ఆదికర్మయోగి గ్రామ విజన్ మ్యాప్ సిద్ధం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా స్థాయి నుండి గ్రామ స్థాయి వరకు 20 లక్షల మంది గిరిజన యువతకు ఆది కర్మయోగి సేవాదాతలుగా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. భారత్ @ 2047 దృష్టితో ఈ మిషన్ గిరిజన గ్రామాల అభివృద్ధి కోసం గ్రామ స్థాయిలో నాయకత్వం, పారదర్శకత, బాధ్యతాయుత పరిపాలనను బలోపేతం చేయడమే ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ప్రభుత్వ సేవలు చివరి మైలుకు చేరే విధంగా సదుపాయాలను బలోపేతం చేస్తుందన్నారు. ఆగస్టు 4వ తేదీ నుండి ఆదికర్మయోగి కార్యక్రమం అమలుపై శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని, ఈ మేరకు మండల, గ్రామ స్థాయిలో శిక్షణా కార్యక్రమాల నిర్వహణకు ప్రణాళికలు తయారు చేయాలని ఆదేశించారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆదికర్మయోగి కార్యక్రమం అమలుకు మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ అందించారన్నారు. మాస్టర్ ట్రైనర్లు జిల్లా స్థాయి నుండి గ్రామ స్థాయి వరకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. ు. అనంతరం జిల్లా సమగ్ర అభివృద్ధి ఆదికర్మయోగి అమలుకు కృషి చేస్తానని ప్రతిజ్ఞ చేయించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజె. అభిషేక్ గౌడ, సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్, డిఆర్ఒ కె.పద్మలత, జిల్లా మాస్టర్ ట్రైనర్లు వి.నాగ శిరీష, డి. శారదాదేవి, జె. అచ్యుత్ కిరణ్, ఆర్.రామమ్, పి. చంద్రకిరణ్, డి.ధ్రువ్‌కుమార్, బి. బాబు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ పథకాలపై ప్రచారం

ప్రజాశక్తి -డుంబ్రిగుడ : మండల కేంద్రంలో టిడిపి పోతంగి పంచాయతీ అధ్యక్షుడు ఎం భీమరాజు ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ప్రతి గడపగడపకు తిరుగుతూ టిడిపి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై కరపత్రాలను పంచుతూ, గిరిజనులకు అవగాహన కల్పించారు. టిడిపి కూటమి ప్రభుత్వంతోనే సామాన్య ,మధ్య తరగతి పేద ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు.కార్యక్రమంలో ఆ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు టి సుబ్బారావు, మండల కార్యదర్శి కె రవి, చంటి పాల్గొన్నారు.

కరపత్రాలను పంచుతూ ప్రచారంలో టిడిపి నేతలు

స్మార్ట్ మీటర్లను అడ్డుకోండి

క్యూ ఆర్ కోడ్‌ను విడుదల చేస్తున్న బోనంగి చిన్నయ్యపడాల్

ప్రజాశక్తి-కొయ్యూరు : ఆదాని స్మార్ట్‌మీటర్లను గృహవినియోగదారులు అడ్డుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు బోనంగి చిన్నయ్యపడాల్ పిలుపునిచ్చారు. బుధవారం పార్టీ మండల కార్యదర్శి ఎస్ సూరిబాబు కొయ్యూరు మండల కేంద్రంలో సిపిఎం రాష్ట్ర కమిటీ ముద్రించిన క్యూ ఆర్‌కోడ్‌ను గ్రామస్తులతో కలిసి విడుదల చేశారు. స్మార్ట్‌మీటర్లు పెట్టొద్దు ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలి. సెకి ఒప్పందాన్ని రద్దు చేయాలని భారాలు పెంచే విద్యుత్ స్మార్ట్ మీటర్లను విద్యుత్ వినియోగదారులు ఈ క్యూఆర్ కోడ్ తో వ్యతిరేకించాలని కోరారు. ఈ మీటర్లు ప్రీ పెయిడ్ మీటర్లు సెల్‌ఫోన్ మాదిరిగా ముందుగా రీ చార్జీ చేసుకోవాలి. ప్రస్తుతం ఉన్న పోస్ట్‌పెయిడ్ విధానంలో బిల్లు చెల్లించటానికి 15 రోజులు గడువు ఉంటుందన్నారు. బిల్లు చెల్లించకపోతే ఫైన్‌తో చెల్లించటానికి, అప్పటికీ చెల్లించకపోతే, కనెక్షన్ కట్ చేయటానికి నిర్దిష్టమైన గడువు ఉంటుందని ప్రీ పెయిడ్ విధానంలో అది ఉండదని తెలిపారు. ఎప్పుడు డబ్బులు అయిపోతే అప్పుడు కనెక్షన్ కట్ అవుతుందని, పరిశ్రమలు, వ్యాపార సంస్థలు లక్షల్లో విద్యుత్ బిల్లులు చెల్లిస్తుంటాయి. వాడుకున్న తరువాత చెల్లించే బిల్లు నిర్దిష్టంగా ఉంటుంది. అదే మొత్తాన్ని ముందుగా ఊహించి చెల్లించాలంటే పరిశ్రమలకు, వ్యాపార సంస్థలకు వర్కింగ్ కేపిటల్ పెరుగుతుందన్నారు. వాడుకున్న తరువాత పేపరు మీద బిల్లు ఇస్తే ఎంతవాడామో, ఏ రేటు చెల్లిస్తున్నామో నిర్దిష్టంగా ఉంది. ప్రీపెయిడ్ అయితే యూనిట్‌కు ఎంత వసూలు చేస్తున్నారో వినియోగదారునికి తెలియదన్నారు. మొత్తం విద్యుత్‌రంగాన్ని ప్రైవేటీకరించటం కోసం వేగంగా పావులు కదుపుతున్నారని ఇందులో భాగంగా స్మార్ట్ మీటర్లు అమలు చేస్తున్నారన్నారు. జగన్ ప్రభుత్వం ఖరారు చేసిన ఆదానీ కంపెనీకి చెందిన స్మార్ట్ మీటర్లను చంద్రబాబునాయుడు కొనసాగించడానికి నడుం కట్టారని ఇద్దరూ ఒకటేనని విమర్శించారు. గిరిజనులకు ఇస్తున్న 200 లోపు యూనిట్లు ప్రీ బిల్లు మొత్తం రద్దు అవుతుందన్నారు. స్మార్ట్‌మీటర్లు రాకుండా అడ్డుకుందాం అని పిలుపునిచ్చారు.

మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో పోలీసుల అప్రమత్తత

ప్రజాశక్తి -కొయ్యూరు : మావోయిస్టు పార్టీ వారోత్సవాల నేపథ్యంలో ఏజెన్సీలో కటుదిట్టమైన గాలింపుచర్యలు చేపడుతూ స్థానిక ప్రజాప్రతినిధులకు ముందస్తు హెచ్చరికలు జారీ చేసినట్టు కొయ్యూరు ఎస్ఐ కిషోర్‌వర్మ తెలిపారు. నర్సీపట్నం నుంచి ఏజెన్సీ వెళ్లే పాడేరు, నర్సీపట్నం ఆర్టీసి డిపోలకు చెందిన నైట్‌హాల్ట్ బస్సులను కొయ్యూరు పోలీస్‌స్టేషన్ వద్ద నిలుపుదల చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. ప్రజాప్రతినిధులు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా బయటకు వెళ్లరాదని, జాగ్రత్తలు తీసుకోవాలని సూచించినట్టు ఎస్ఐ కిషోర్‌వర్మ తెలిపారు.

నేడు ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: స్థానిక ఉపాధిహామీ కార్యాలయం వద్ద 2024- 25 వార్షిక సంవత్సరంలో జరిగిన పనులపై సామాజికతనిఖీ బృందం కోఆర్డినేషన్ సమావేశం గురువారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనుందని ఎంపిడిఒ యాదగిరేశ్వరరావు, ఎపిఒ శ్రీనివాసులు బుధవారం విలేకరులకు తెలిపారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది హాజరు కావాలన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న పిఒ సింహాచలం

మహిళాభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి- రంపచోడవరం: ఏజెన్సీలో వెదురు ఉత్పత్తుల ద్వారా మహిళలు అభివృద్ధి చెందే విధంగా తగు చర్యలు చేపట్టడం జరుగుతుందని రంపచోడవరం ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఐటిడిఎ సమావేశ భవనంలో వెలుగు ఎపిడి, డిపిఎం, ఎపిఎంతో వెదురు ఉత్పత్తుల రిజిస్ట్రేషన్ చేసుకున్న మహిళలతో ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్, భారత ఇనిస్టిట్యూట్ పబ్లిక్‌పాలసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలో మహిళలు వెదురును సేకరించడం, వెదురుని పెంచడం అదేవిధంగా సేకరించిన వెదురును వివిధ రకాలలో మార్కెట్‌కు పంపే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఫారెస్ట్ ప్రొడ్యూసర్ కంపెనీ ద్వారా ఏజెన్సీలోని మహిళలకు వెదురు ఉత్పత్తులపై గ్రామస్థాయిలో అవగాహన కల్పిస్తామన్నారు. ఏజెన్సీలోని ప్రతి మహిళ ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా వెదురు ఉత్పత్తులు వెదురు సేకరణ అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఈ ప్రాంతాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎపిఒ జనరల్ డిఎన్‌వి రమణ, వెలుగు ఎపిడి దేగలయ్య, డిపిఎం పరమేశ్వరరావు, ఐఎస్‌బి కోఆర్డినేటర్లు సందీప్ చౌదరి, నానిబాబు, హేమంత్ కుమార్, ఎపిఎంలు అపర్ణ, దుర్గ ప్రసాద్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ దినోత్సవాన్ని జయప్రదం చేయండి

మాట్లాడుతున్న పూనెం ప్రదీప్‌కుమార్

మాట్లాడుతున్న సీసం సురేష్

ప్రజాశక్తి - విఆర్‌పురం: రేఖపల్లిలో ఆదివాసీ గిరిజన సంఘం మండల కమిటీ సమావేశం పులి బుజ్జి అధ్యక్షతన నిర్వహించారు. మండల కార్యదర్శి పూనెం ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ ఆగస్టు 9న జరిగే ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని పురస్కరించుకుని కూనవరం మండలంలో జరిగే కోయ్‌తోర్ పండుం దక్కూట్ కూనవరం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆదివాసీల ఆచార సాంప్రదాయాలను నేటితరానికి తెలియ చేయడం కోసం, ఆదివాసీల చట్టాలు, హక్కుల గురించి కూడా వివరించడం జరుగుతుందని తెలిపారు. ఆగస్టు 1 నుండి 8 వరకు జెండా ఆవిష్కరణ కార్యక్రమలు చేపట్టాలని, 9న కూనవరంలో జరిగే 4 మండలస్థాయి కార్యక్రమాన్ని ఆదివాసీ ప్రజలు జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో మండల కమిటి సభ్యులు కారం సుందరయ్య, పూసం సత్తిబాబు, గొర్రె రాజు, ఆత్మకూరి కాంతారావు, బొప్పెన రాజు తదితరులు పాల్గొన్నారు.

చింతూరు: ఆదివాసీ దినోత్సవానికి అంతా హాజరు కావాలని గిరిజన సంఘం రాష్ట్ర కమిటి సభ్యులు సీసం సురేష్ పిలుపునిచ్చారు. చింతూరు మండల గిరిజన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు ఆగస్టు 9న కార్యక్రమానికి గిరిజన సంఘ రాష్ట్ర నాయకులు సాంస్కృతిక కళాకారులు హాజరవుతున్నారని దీనిని జయప్రదం చేయాలని కోరారు. గిరిజన సంఘం చింతూరు మండల అధ్యక్షులు కారం నాగేష్, కారం సుబ్బారావు, పొడియం లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వాలీబాల్ నెట్ అందిస్తున్న ఎస్ఐ రవీంద్ర

ఉన్నత లక్ష్యంతో విద్యార్థులు చదవాలి

ప్రజాశక్తి -సీలేరు: జికెవీధి మండలం సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం సీలేరు ఎస్ఐ రవీంద్ర విద్యార్థులతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలన్నారు. పోక్స్ చట్టం, యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన కల్పించారు. బాల్యవివాహాలు చేసుకుంటే జరిగే పరిణామాలు గురించి విపులంగా వివరించారు. మహిళలకు సమస్యలు ఎదురైనప్పుడు శక్తి యాప్ ఏ విధంగా వినియోగించుకోవాలో వివరించారు. డయల్ 100 సైబర్ క్రైమ్ వలన జరిగే నష్టాలు వాటిపట్ల ఏ విధంగా వ్యవహరించాలో అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్లపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులకు వాలీబాల్ నెట్‌ను పోలీసులు అందజేశారు. కార్యక్రమంలో పోలీసులు ప్రిన్సిపల్ వి.శంకరరావు కామర్స్ లెక్చరర్ శ్రీనివాస్ అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ చినబాబు

అమీనాబాద్‌లో 'పోలీసుల పల్లెనిద్ర'

ప్రజాశక్తి -రాజవొమ్మంగి : అమీనాబాద్‌లో మంగళవారం రాత్రి జడ్డంగి ఎస్ఐ చినబాబు ఆధ్వర్యంలో పోలీసులు పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు పలు ముఖ్యమైన అంశాలపై అవగాహన కల్పించారు. మోసపూరిత ఉద్యోగ ప్రకటనల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. బాల్యవివాహాల వలన అనర్థాలు, రహదారి భద్రత, వాహనదారులు హెల్మెట్ వాడాలని, మహిళల భద్రత కోసం రూపొందించిన శక్తి యాప్ గురించి వివరించారు. మాదకద్రవ్యాల తయారీ, నిల్వ, రవాణా, వినియోగం వంటి కార్యకలాపాల్లో పాల్గొనడం వల్ల తీవ్రమైన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు.

ఆదివాసీల సాగుకు అనుమతి ఇవ్వండి

పిఒకు వినతిపత్రం ఇస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు

ప్రజాశక్తి- ఎటపాక : స్థానికేతర భూస్వాముల నుండి పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు కోసం సేకరించిన భూముల్లో ఆదివాసీలకు సాగుకు అనుమతి కోరుతూ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఐటిడిఎ పిఒ అపూర్వభరత్‌కు మురుమూరు, ఎర్రగట్టు, రాఘవపురం గ్రామస్తులు కోరారు. బుధవారం నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో పిఒను గిరిజన సంఘ నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. నందిగామ, భూస్వాముల నుండి 2008 - 2010 మధ్యలో పోలవరం ప్రాజెక్టు కోసం సుమారు 100ఎకరాలు ప్రభుత్వం భూసేకరణ చేసి ఆ భూములకు నష్టపరిహారం అందజేశారన్నారు. ఆ భూములను స్థానికేతరులైన భూస్వాములు స్థానిక గిరిజనేతర రైతులకు అక్రమంగా కౌలుకు ఇస్తూ లబ్ధి పొందుతున్నారన్నారు. ప్రస్తుతం ఆ భూములు రెవెన్యూ రికార్డుల్లో పోరంబోకు ప్రభుత్వ భూమిగా నమోదై ఉందని చట్టప్రకారం అటువంటి భూములు ప్రభుత్వభూములు అయినందున స్థానికంగా జీవిస్తున్న ఆదివాసీలకు వాటిని సాగు చేసుకునేందుకు తాత్కాలిక అనుమతి ఇప్పించాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కమిటి సభ్యుడు కాక అర్జున్ దొర, మండల కార్యదర్శి ఇరప అజయ్, నాయకులు సొందే రామారావు, సోయం వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

మానవ అక్రమ రవాణా నేరం

ప్రజాశక్తి -హుకుంపేట : ప్రపంచ మానవ అక్రమ రవాణా దినోత్సవాన్ని బుధవారం హుకుంపేటలో వెజ్, హెచ్ఆర్‌సి స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికలు, బాలుర పాఠశాలల్లో విద్యార్థులకు మానవ అక్రమ రవాణాపై సంస్థ ప్రతినిధి టి.కృష్ణారావు అవగాహన కల్పించారు. ఆర్థిక ప్రయోజనాల కోసం మనుషులను అంగడి సరుకుల్లా కొనుగోలు, అమ్మకాలు చేయడం అత్యంత హేయమైన ఈ చర్యల మానవ హక్కుల ఉల్లంఘనగా అభివర్ణించారు లైంగిక దోపిడీ, వెట్టిచాకిరి, బానిసత్వం రూపాల్లో కొనసాగుతున్నాయని,వీటిపై అవగాహన కలిగి నియంత్రణకు ప్రతిఒక్కరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. మానవ రవాణా నియంత్రణలో అవగాహన పెంచడం, చైతన్యం సృష్టించడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి

ప్రజాశక్తి-చింతపల్లి: ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రయాణాలు సాగిస్తే గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుకోవచ్చని స్థానిక సిఐ వినోద్‌బాబు సూచించారు. ప్రయాణికుడు, వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలను గౌరవించి, చట్టబద్ధంగా వాహనాలు నడిపించాలని కోరారు. అతివేగం ప్రమాదకరమని,చిన్న నిర్లక్ష్యంతో భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని గుర్తించాలన్నారు. ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని, హెల్మెట్లు ధరించడంతో పాటు వేగాన్ని నియంత్రించాలని, ఇతర వాహనదారుల పట్ల సహనం పాటించాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్‌లతోపాటు వాహనపు పత్రాలు కలిగి ఉండాలని సూచించారు.

పైథాన్ ప్రోగ్రామింగ్‌పై గీతంలో ఎఫ్‌డిపి

ప్రజాశక్తి-మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యాన 'ఇంజినీరింగ్ రంగంలో పైథాన్ ప్రోగ్రామింగ్ -ప్రయోజనాలు' అంశంపై ప్యాకల్టీ డెవలప్‌మెంట్ (ఎఫ్‌డిపి) కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. ఐఐటి గౌహతిలోని ఎలక్ట్రానిక్స్, ఐసిటి అకాడమీ ఆధ్వర్యాన ప్రముఖ శాస్త్రవేత్తలు, పరిశోధకులు, పరిశ్రమల నిపుణులు రిసోర్స్ పర్సన్‌లుగా పాల్గొన్నారు. ఐఐటి గౌహతి ఆర్యభట్ట సాహా, ఐఐటి గౌరవ్ త్రివేది, ఐఐటి జబల్‌పూర్ ప్రొఫెసర్ అతులోప్యా, ఎన్ఐటి పాట్నా ప్రొఫెసర్ డాక్టర్ భాస్కర్ మండల్ పాల్గొని అధ్యాపకులకు దిశానిర్దేశం చేశారు. ఇంజినీరింగ్‌లో ఆటోమేషన్, కృత్రిమ మేధ, సిగ్నల్ ప్రాసెసింగ్, డేటా ఎనలిటిక్స్‌లో పైథాన్ ప్రోగ్రామింగ్ ప్రాధాన్యతను వారు వివరించారు. పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా ఇంజనీరింగ్ అనువర్తనాలకు పైథాన్ కీలకమని తెలిపారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.నాగేంద్రప్రసాద్ ప్రసంగిస్తూ డిజిటల్ యుగంలో నూతన ఆవిష్కరణలకు పైథాన్ ప్రోగ్రామింగ్ ప్రయోజనకరంగా నిలుస్తోందని, అధ్యాపకులు నిరంతర అధ్యయనం ద్వారా బోధన, పరిశోధనలో ఉత్తమ ఫలితాలు అందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఇసిఇ విభాగాధిపతి ప్రొఫెసర్ పి.భరత్ చంద్రకుమార్, ఎఫ్‌డిపి కన్వీనర్లు డాక్టర్ వి.జ్యోతి, డాక్టర్ కరుణకుమారి, డాక్టర్ ఐ.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఇంజినీరింగ్ అధ్యాపకులతో పాటు నౌకాదళ అకాడమి బోధన సిబ్బంది హాజరయ్యారు.

బైక్ దొంగతనం కేసులో 14 నెలల జైలు శిక్ష

ప్రజాశక్తి- ఆనందపురం: ఆనందపురం క్రైమ్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన మోటార్ సైకిల్ దొంగతనానికి సంబంధించి ముద్దాయికి కృష్ణబాబు అలియాస్ గంగబాబు భీమిలి 15వ అదనపు జూనియర్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి స్వాతి భవాని 14 నెలల సాధారణ జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధించారు. జరిమానా చెల్లించకపోతే అదనంగా 15 రోజుల జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తీర్పులో పేర్కొన్నట్లు ఆనందపురం క్రైమ్ ఎస్ఐ సత్యారావు తెలిపారు. ఆనందపురం మండలం పల్లిపేట గ్రామానికి చెందిన విద్యుత్ సంస్థ ఉద్యోగి పల్లి రామకృష్ణ బైక్‌ను 2024 సెప్టెంబర్ 13న రింతితడు ముద్దాయి కృష్ణబాబు దాన్ని దొంగిలించాడు. ఈ కేసులో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు వెలువరించారు.

అడవి పనసకు భలే గిరాకీ

- ఏజెన్సీలో ఘాట్‌రోడ్డు పొడుగునా అమ్మకాలు
- ఆశావహ ధరతో గిరి రైతులకు కాసుల పంట

ప్రజాశక్తి -అనంతగిరి : గమ్మత్తైన రుచి, సువాసనతో నోరూరించే అడవి పనసకు భలే గిరాకీ లభిస్తోంది. ఏటా జూన్, జూలై నెలలోనే అందుబాటులోకి వచ్చే పనస కాయలను అనంతగిరి, అరకు పర్యాటక ప్రాంతాలను తిలకించేందుకు వచ్చే పర్యాటకులు ఎగబడి కొనుగోలు చేస్తున్నారు. అనంతగిరి ఘాట్ రోడ్డు డముకు, బొర్రా జంక్షన్, అనంతగిరి, తదితర ప్రాంతాల్లో గిరిజనులు రోడ్డుకు ఇరువైపులా విక్రయిస్తుంటారు. అయితే గత నెల తొలకరి సమయంలో ఒక పనస కాయ రూ. 50 నుంచి రూ. 150 ధర పలకగా, ఇప్పుడు రూ. 200 నుంచి రూ.250 వరకు అమ్మకాలు సాగిస్తున్నారు. ఘాట్‌రోడ్డు పొడుగునా పలుచోట్ల అడవి పనసపండ్లు, కాయలను పోగులుగా వేసి స్థానిక గిరిజనులు అమ్మకాలు సాగిస్తున్నారు. ఘాట్‌రోడ్డు రక్షణ గోడపై పొందికగా అమర్చిన అడవి పనసకు ప్రస్తుతం మంచి గిరాకీ ఉంది.

అనంతగిరి ఘాట్ రోడ్డు ప్రధాన రహదారిలో విక్రయానికి సిద్ధంగా ఉంచిన పనస

అల్లూరి జిల్లాలో పర్యాటక అందాలను తిలకించేందుకు వచ్చే పర్యాటకులు ఇక్కడ లభించే అటవీ, గిరిజన ఉత్పత్తులను కొనుగోలు చేసి వెళుతుంటారు. అందులో భాగంగానే అరకు కాఫీకి విశేషమైన గిరాకీ ఉండగా, ఈ సీజన్‌లో పనస కాయలను అదే మాదిరిగా కొనుగోలు చేస్తుంటారు. అంతే కాకుండా మరి కొంతమంది రైతులు అనంతగిరి. డమ్ముకు. కాశిపట్నం. గుమ్మ కోట. వారపు సంతలకు అడవి పనస పండ్లను తీసుకెళ్లి విక్రయిస్తారు విశాఖ. విజయనగరం. మైదాన ప్రాంతాల నుంచి వ్యాపారులు తరలి వచ్చి ఏజెన్సీలో రైతుల వద్ద పనస పండ్లను పెద్దమొత్తంలో కొనుగోలు చేసి వాటిని మైదాన ప్రాంతాలకు తరలించి, మంచి లాభాలకు మారు అమ్మకాలు కూడా చేస్తున్నారు. మొత్తానికి ప్రస్తుతం ఏజెన్సీలో లభించే అడవి పనస పండ్లు అటు గిరిజన రైతులకు, ఇటు వ్యాపారులకు కాసులపంట పండిస్తుందంటే అతిశయోక్తి కాదు.

పకడ్బందీగా స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లు

జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లపై మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి -పాడేరు: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగానిర్వహించడానికి పకడ్బందీ ఏర్పాట్లను చేయాలని జిల్లా కలెక్టర్ ఎఎస్. దినేష్ కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లపై చర్చించారు. గత ఏడాది మాదిరిగా స్థానిక తలారిసింగి ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల మైదానంలో నిర్వహించాలని, స్వాతంత్ర సమరయోధుల కుటుంబాలను వేడుకలకు ఆహ్వానించి సత్కరించాలని సూచించారు. అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేసి విజయవంతంగా స్వాతంత్ర్య దినోత్సవం వేడుకలను నిర్వహించాలన్నారు. అంతరాయం లేకుండా విద్యుత్తు సరఫరా చేయాలని ట్రాన్స్‌కో అధికారులకు సూచించారు. వేడుకలకు హాజరయ్యే అధికారులకు, అతిధులకు, విద్యార్థులకు తాగు నీటి సౌకర్యం కల్పించాలని గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలపై స్టాల్సు ఏర్పాటు చేయాలని, శకటాల ప్రదర్శన చేయాలని సూచించారు. జిల్లాలో ఉన్న మూడు ఐటిడిఎ నుంచి మూడు స్టాల్సు ఏర్పాటు చేయాలన్నారు. పోలీసు, ఐసిడిఎస్, సెరికల్చర్, అటవీశాఖ, జిల్లా సర్వజన ఆసుపత్రి, దివ్యాంగుల సంక్షేమ శాఖలు సంయుక్తంగా స్టాల్స్‌ను ఏర్పాటు చేయాలని స్పష్టం చేసారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి, జిల్లా పంచాయతీ అధికారి, అటవీ శాఖ, పర్యాటక శాఖ, జిసిసి, పౌర సరఫరాలశాఖ, డ్వామా ఎన్ఎంఐ, గృహ నిర్మాణశాఖ ఎపిఇపిడిసిఎల్, ఆర్‌టిఒ, అన్ని ఇంజనీరింగ్ విభాగాలు, వ్యవసాయానుబంధశాఖలు సంయుక్తంగా ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలపై శకటాల ప్రదర్శన చేయాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్. ఎంజె. అభిషేక్ గౌడ, సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్, డిఆర్ఒ కె. పద్మలత, పోలీస్ అధికారి ఎస్ఎల్ .నారాయణ రెడ్డి, డిఇఒ పి. బ్రహ్మాజీరావు, డివిజనల్ పంచాయతీ అధికారి పి.ఎస్.కుమార్, డిఎంహెచ్ఒ డాక్టర్ టి. విశ్వేశ్వరరావు నాయుడు, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.బి.ఎస్. నంద్, సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వమిత్ర, డ్వామా పిడి డాక్టర్ విద్యా సాగర్, డిఆర్‌డిఎ పిడి వి.మురళిపాల్గొన్నారు.

గర్భాశయ కేన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న అపోలో వైద్యులు

ముందస్తు గుర్తింపుతో గర్భాశయ కేన్సర్‌కు అడ్డుకట్ట

ప్రజాశక్తి - అరిలోవ : మహిళలకు సోకే కేన్సర్లలో ఐదో స్థానంలో ఉన్న గర్భాశయ కేన్సర్‌ను ముందుగానే గుర్తిస్తే ఈ వ్యాధి ముప్పు నుండి బయట పడవచ్చని ఆరిలోవ అపోలో కేన్సర్ వైద్య నిపుణులు తెలిపారు. గర్భాశయం, అండాశయం కేన్సర్లను ముందుగానే గుర్తించే ఎండిఒ కార్యక్రమాన్ని బుధవారం అపోలో ఆస్పత్రిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ సైలెంట్ కిల్లర్‌గా చెప్పబడే అండాశయ కేన్సర్ 55 నుండి 64 ఏళ్ల వయసు మధ్యలో మహిళలకు అధికంగా వస్తుందన్నారు. 2025 నాటికి 1.57 మిలియన్ల కేన్సర్ కేసులు భారతదేశంలో పెరుగుతాయని సర్వేలు చెబుతున్నాయని తెలిపారు. కడుపు ఉబ్బరం, కడుపులో నొప్పి, మలబద్ధకం, జననేంద్రియాల నుంచి రక్తస్రావం వంటి లక్షణాలు కనిపిస్తే మహిళలు తక్షణమే వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో వైద్యులు డాక్టర్ సుమన్ దాస్, డాక్టర్ ఎంపిఎస్ చంద్రకల్యాణ్, డాక్టర్ సౌదామిని, డాక్టర్ శ్రీదేవి, సిఒఒ కృష్ణ ప్రసాద్ తదితరులు మహిళల కేన్సర్‌పై అవగాహన కల్పించారు.

మెడికవర్‌లో సంక్లిష్ట కేన్సర్ సర్జరీ

ప్రజాశక్తి - ఆరిలోవ : మెడికవర్ కేన్సర్ ఇన్‌స్టిట్యూట్ వైద్యులు అత్యంత సంక్లిష్టమైన కేన్సర్ శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తిచేసినట్లు సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ కార్తీక్ చంద్ర వల్లం తెలిపారు. 58 ఏళ్ల మహిళకు సోకిన 'సూడోమైక్సోమా పెరిటోనియై' (పిఎంపి) అరుదైన పొత్తికడుపు కేన్సర్‌కు, సైటోరెడక్టివ్ సర్జరీతో పాటు హైపర్‌థెర్మిక్ ఇంట్రాపెరిటోనియల్ కెమోథెరపీ (హెచ్ఐపిఇసి)ని నిర్వహించినట్లు పేర్కొన్నారు. పొత్తికడుపు ఉబ్బరం, త్వరగా కడుపు నిండినట్లు అనిపించడంతో రోగి మెడికవర్‌ను సంప్రదించారని, పరీక్షల్లో పొత్తికడుపు కుహరంలో శ్లేష్మపు నిక్షేపాలు ఉన్నట్లు వెల్లడైందని వివరించారు. బయాప్సీలో లో-గ్రేడ్ అపెండిసియల్ మ్యూసినస్ నియోప్లాసం (ఎల్ఎఎంఎన్) ఉన్నట్లు నిర్ధారణ కావడం, కణితులు విస్తృతంగా వ్యాప్తి చెందడం వల్ల సంప్రదాయ కీమోథెరపీకి స్పందించకపోవడంతో వైద్య బృందం గరిష్ట సైటోరెడక్టివ్ సర్జరీ, ఆపై హెచ్ఐపిఇసి చేయడానికి నిర్ణయించినట్లు తెలిపారు. ఈ అత్యాధునిక చికిత్సా విధానం దేశంలోని కొన్ని అడ్వాన్స్‌డ్ కేన్సర్ సెంటర్లలో మాత్రమే అందుబాటులో ఉందని పేర్కొన్నారు. 12 గంటల పాటు శస్త్రచికిత్స చేసి విజయవంతం చేసినట్లు తెలిపారు. రోగి ఎటువంటి సమస్యలు లేకుండా కొద్ది రోజుల్లోనే సాధారణ స్థితికి చేరుకొని డిశ్చార్జ్ అయ్యారని తెలిపారు. ఈ శస్త్రచికిత్సలో డాక్టర్ కార్తీక్‌తోపాటు డాక్టర్ లలిత్యాస్వర్ణ, డాక్టర్ ప్రవీణ్ పాల్గొన్నారు.

కోలుకున్న రోగితో మెడికవర్ వైద్యులు

సమిత్వ సర్వేపై శిక్షణ

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం సమిత్వ సర్వేపై రెండు రోజులపాటు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండలంలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు శిక్షణ ఇస్తున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ మండల అభివృద్ధి అధికారి బి.సత్యనారాయణ మాట్లాడుతూ, ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు వచ్చే మూడు నెలల్లో మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో సమిత్వ సర్వే పూర్తి చేయాలన్నారు. సర్వే ప్రక్రియలో ప్రతి ఇంటికీ కొలతలు తీసి, సంబంధిత యజమానులకు ప్రాపర్టీ కార్డులు జారీ అవుతాయని వివరించారు.

సమస్యలు వింటున్న జనసేన నాయకులు

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-వి.ఆర్.పురం: సమస్యలుంటే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని జనసేనపార్టీ మండల అధ్యక్షులు ములకాల సాయికృష్ణ, మహిళా అధ్యక్షురాలు వీరమహిళ బాగుల ప్రమీలరాణి స్పష్టం చేశారు. బుధవారం వడ్డిగూడెం సచివాలయం, వరరామచంద్రాపురం, జూనియర్ కళాశాల, జెడ్పీ హైస్కూల్, రాజుపేట సచివాలయంలో విస్తృతంగా పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. హైస్కూల్‌లో సిబ్బంది కొరత ఏమైనా ఉందా మధ్యాహ్న భోజనం ఎలా ఉంది అని అడిగి తెలుసుకున్నారు. సచివాలయం సిబ్బంది అందుబాటులో ఉండాలని లేదంటే చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. జూనియర్ కళాశాలను కూడా సందర్శించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి బాగుల అంజనరావు, సహాయ కార్యదర్శులు కొత్తూరి శేషు, మాచర్ల వేణుబాబు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ సామగ్రి వితరణ

ప్రజాశక్తి- చింతూరు: పేగ పంచాయతీ అల్లిగూడెం గ్రామానికి చెందిన పెనుబల్లి దేశాయ్ గుడిసెలో ఉంటూ వర్షాకాలంలో తడిసిపోతూ నానా అవస్థలు పడుతున్నాడు. జెకెసి ట్రస్ట్ చైర్మన్ జమాల్‌ఖాన్‌కు తన పరిస్థితి వివరించాడు. బుధవారం ఆయనకు సిమెంట్ రేకులు, ఇనుపపైపులను జమాల్‌ఖాన్ అందజేశారు. ట్రస్ట్‌సెక్రటరీ ఇమ్రాన్‌ఖాన్, సభ్యులు జహంగీర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అందించిన పెన్నులు, దుస్తులు

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి - రంపచోడవరం : మండలంలోని చినబారంగి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో లయన్స్ క్లబ్ మహిళా రాజమహేంద్రవరం వారిచే ఎడ్యుకేషనల్ సర్వీస్ కమ్యూనిటీ సర్వీస్‌లో భాగంగా విద్యార్థులకు విద్యార్థుల తల్లితండ్రులకు గ్రామస్తులకు బుధవారం దుస్తులు పంపిణీ చేశారు. విద్యార్థులకు పెన్నులు పెన్సిల్స్ , స్వీట్స్ అందించారు. పాఠశాలలో ఉన్న బోరు బాగుచేసి మోటార్ వేసి వాటర్‌ప్యూరీఫైర్ కూడా అందిస్తామన్నారు. కార్యక్రమానికి కొయ్యన కుమారి, బచ్చు శ్రీదేవి అధ్యక్షురాలు మాటూరి సౌమ్య , కార్యదర్శి మన్యం జ్యోతి, కోశాధికారి అల్లాడ కవిత, నాగిరెడ్డి పద్మావతి హెూనార్బల్ మెంబెర్ మరియు పాఠశాల హెచ్ఎం గడిపే విశ్వరాజ్ గ్రామపెద్దలు పాల్గొన్నారు.

బిజెపి మండల అధ్యక్షునిగా లక్ష్మణరావు

ప్రజాశక్తి - చింతూరు : చింతూరు మండల బిజెపి మండల అధ్యక్షునిగా బట్ట లక్ష్మయ్యరాజును జిల్లా అధ్యక్షురాలు మఠం శాంతకుమారి నియమించి నియామక పత్రం అందజేయడంతో పాటు త్వరగా మండల కమిటీ బూత్ కమిటీలు శక్తికేంద్ర ప్రముఖులు నియమించాలన్నారు. అందరూ సమిష్టిగా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు.

పుట్టకోట వెళ్లాలంటే పుట్టెడు కష్టాలు..

- సరుకుల తరలింపునకు గుర్రాలే ఆధారం..
- రోగులకు డోలీయే శరణ్యం

ప్రజాశక్తి - కొయ్యూరు : కొయ్యూరు మండలం మఠం భీమవరం పంచాయతీ మారుమూల గ్రామమైన పుట్టకోట గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు. తమ గ్రామానికి వెళ్లాలంటే కాలినడకే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యావసరాలు, తదితర సరుకులు తరలించాలంటే గుర్రాలపైనే ఆధారపడుతున్నామని తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారిని ఆసుపత్రికి తరలించాలంటే డోలీమోత తప్పదన్నారు. తమకు రహదారి సౌకర్యం కల్పించాలని కోరారు. పిఎల్ కొత్తూరు పిహెచ్‌సి వై రామవరం రావాలంటే 20 కిలోమీటర్లు పంచాయతీ హెడ్‌క్వార్టర్స్‌కి వెళ్లాలంటే మారేడుమిల్లి మీదుగా 150 కిలోమీటర్లు ఎర్లగడ్డ మీదుగా 70 కిలోమీటర్లు వెళ్లాల్సి ఉంటుందన్నారు. అధికారులు ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తునఆనరు. రేషన్ సరుకులు తెచ్చుకోవడానికి ప్రతినెలా చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వర్షాకాలంలో బురదలో నడుస్తూ సరుకులు తీసుకెళ్లాల్సి వస్తోందన్నారు. ఇప్పటికైనా అధికారుల దృష్టి సారించి రోడ్డు వేసే దిశగా చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

గుర్రాలపై సరుకులు తీసుకెళ్తున్న గ్రామస్తులు

సమస్యలను పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి -ఎటపాక: గోదావరి ముంపు నుండి కాపాడేందుకు కరకట్టను పొడిగించాలని, ఎటపాక మండల కేంద్రంలో మౌలిక సమస్యలను పరిష్కరించాలని సిపిఎం నాయకుడు డేగల మాధవరావు చింతూరు ఐటిడిఎ పిఒ అపూర్వభరత్‌కి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఎంపిడిఒ కార్యాలయంలో మీ కోసం కార్యక్రమం నిర్వహించారు. గోదావరి కరకట్ట స్లోయిజులు మరమ్మతులు చేసి కరకట్టను పొడిగించేందుకు నిధులు కేటాయించడంలో ప్రభుత్వం విఫలమైందని, రాష్ట్ర విభజన తర్వాత ఈ ప్రాంత ప్రజలు చదువు, వైద్యానికి, ఉపాధికి దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

మండల కేంద్రమైన ఎటపాకలో తక్షణం హైస్కూల్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, బ్యాంకు, అగ్నిమాపక కేంద్రం, పశువుల ఆసుపత్రి, శాశ్వత సచివాలయ నిర్మాణం చేపట్టాలని వినతిపత్రంలో కోరారు. స్పందించిన పిఒ సాధ్యమైనంతవరకు తన పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తానని అలాగే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారని మాధవరావు తెలిపారు.

వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నాయకులు మాధవరావు

అదేవిధంగా గుండాల గ్రామ పంచాయతీ పరిధిలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, నిధులు కేటాయించి రోడ్ల నిర్మాణం చేయాలని ఐడిబిఐ అధికారులకు సిపిఎం ఆధ్వర్యంలో వినతి అందించారు. కార్యక్రమంలో తోట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

18న ఓపెన్ టాప్ వాహనం బహిరంగ వేలం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సమాచార పౌరసంబంధాల శాఖ విశాఖపట్నం కార్యాలయంలోని ఓపెన్‌టాప్ వాహనానికి ఆగస్టు 18 ఉదయం 11 గంటలకు కార్యాలయ ప్రాంగణంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ప్రాంతీయ సంయుక్త సంచాలకులు మణిరామ్ ఓ ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు రూ.5వేలు ధరావతు సొమ్ము చెల్లించాలని, వేలం దక్కించుకున్న వారు జిఎస్టీతో పాటు మొత్తం నగదు వెంటనే చెల్లించాలని స్పష్టం చేశారు. వివరాలకు 9642714155 నంబరును సంప్రదించాలని సూచించారు.

మెయిన్‌డ్యాం సమీపంలో కొండల మధ్య మేఘాలు

రెగ్యులేటరీ డ్యామ్ గేట్లు నుంచి కిందకు ప్రవహిస్తున్న నీరు

ఏజెన్సీలో ప్రకృతి అందాల కనువిందు

ప్రజాశక్తి -సీలేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా ఆంధ్ర ఒరిస్సా సరిహద్దులో ఉన్న సీలేరులో ప్రకృతి దృశ్యాలు కనిపిస్తుంటాయి. బుధవారం సూర్యోదయం సమయంలో స్థానిక మెయిన్ డ్యామ్ సమీప ఎత్తైన కొండల మధ్య మేఘాలు అలరించాయి. రెగ్యురేటరీ డ్యామ్ గేట్లు నుంచి కిందకు ఉరుకుతున్న నీటిని చూస్తూ వాకింగ్‌కు వచ్చిన వాకర్స్ పరవశించిపోయారు.

వరలక్ష్మి కానుక అందుకున్న మహిళలు

బంగారు వరలక్ష్మి కానుకకు స్పందన

ప్రజాశక్తి - దేవీపట్నం : మండలంలో ఇందుకూరుపేట హైస్కూల్ గ్రౌండ్ లో బుధవారం బంగారు వరలక్ష్మి కానుక -3 కార్యక్రమం నిర్వహించారు. దీనికి విశేష స్పందన లభించింది. పరిసర గ్రామాల నుంచి మహిళలు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బిజెపి నాయకులు కంబాల శ్రీనివాసరావు, పద్మావతిదేవి గంగారత్నం దంపతులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. లక్కీ డ్రాలో గెలిపొందిన 80 మంది మహిళలకు కంబాల శ్రీనివాసరావు దంపతులు బంగారు వరలక్ష్మి రూపులను ఉచితంగా పంపిణీ చేసారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణ ధ్యేయంగా మహిళలు సంతోషంగా వరలక్ష్మి పండుగను జరుపుకోవాలనే ఉద్దేశంతో 2023లో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. కార్యక్రమానికి విశేషస్పందన రావడంతో ఈ ఏడాది కూడా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రతి మహిళకి బంగారురూపు వచ్చే వరకు ఈ కార్యక్రమాన్ని ఏటా నిర్వహిస్తునే ఉంటానన్నారు. లక్కీ డ్రాలో గెలుపొందని మహిళలకు పసుపు, కుంకుమ, జాకెట్‌ముక్కలు పంపిణీ చేసారు. కార్యక్రమంలో బత్తుల నానాజీ, రావిపాటి గోవిందరావు, కంబాల యువసేన అధ్యక్షులు ఉంగరాల మణిరత్నం, దేశాల నరేష్ పాల్గొన్నారు.

రోలర్ స్కేటింగ్ విజేత శివకోటి క్షేత్ర

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : సౌత్ కొరియాలో ఈనెల 21వ తేదీ నుంచి జరుగుతున్న 20వ ఏషియన్ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ 2025 పోటీల్లో విశాఖ క్రీడాకారిణి సిల్వర్ మెడల్ సాధించారు. నగరానికి చెందిన శివకోటి క్షేత్ర డి దినేష్ కలిసి ఫెయిర్ స్కేటింగ్ పోటీల్లో పాల్గొని సిల్వర్ మెడల్ సాధించారు. శివకోటి క్షేత్ర గతంలో చైనాలో జరిగిన 19వ ఏషియన్ రోలర్ స్కేటింగ్ పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా పలువురు ఆమెను అభినందించారు. శివకోటి క్షేత్ర తండ్రి డాక్టర్ ఎస్.మురళీకృష్ణ విశాఖలో ప్రముఖ హెూమియో వైద్యులు. ఇప్పటివరకు క్షేత్ర 15 జాతీయ మెడల్స్‌తో సహా 49 మెడల్స్ సాధించారు. విశాఖలోని లిటిల్ ఏంజెల్స్ స్కూల్లో పదో తరగతి చదువుతున్న క్షేత్ర కొంతకాలంగా శివాజీపార్క్ స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ కోచ్ పి.సత్యనారాయణ చిట్టిబాబు పర్యవేక్షణలో స్కేటింగ్‌లో శిక్షణ పొందుతున్నారు.

నిరభ్యంతర భూముల్లోని ఇళ్లను క్రమబద్ధీకరించుకోవాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న వారు క్రమబద్ధీకరణ చేసుకోవడానికి ముందుకు వచ్చే విధంగా అవగాహన కల్పించాలని కలెక్టరు హరేందిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. బుధవారం కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడుతూ జిఒఎంఎస్ నంబర్ 30, 45, 27(యుఎల్‌సి) లకు లోబడి నిరభ్యంతర భూముల్లో 2019, అక్టోబర్ 10వ తేదీ కంటే ముందు భూమిని ఆక్రమించుకుని ఆర్సీసీ స్లాబ్ లేదా రేకులతో ఇల్లు నిర్మించుకుని నివాసం ఉండేవారు మీసేవ, గ్రామ, వార్డు సచివాలయం ద్వారా ఈ ఏడాది డిసెంబరు 31లోగా రెగ్యులరైజ్ చేసుకోవడానికి ఆధారాలతో దరఖాస్తు చేసుకొనే విధంగా అవగాహన కల్పించాలన్నారు. ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులకు కన్వియన్స్ డీడ్‌లను తయారు చేయాలని ఆదేశించారు. గుడిసెలు, తాటాకు పూరిళ్లకు ఇది వర్తిసుందన్నారు. పూర్తి అవగాహన కల్పించడం ద్వారా రెగ్యులరైజ్ చేసుకునేందుకు ముందుకు వచ్చే విధంగా కృషి చేయాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం (పిజిఆర్ఎస్)లలో వచ్చిన అర్జీల పరిష్కారంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టరు తెలిపారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలపై వచ్చిన ఫిర్యాదులపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ కె.మయూర్అశోక్, విశాఖపట్నం ఆర్డిఒ శ్రీలేఖ, భీమిలి ఆర్డిఒ సంగీత్ మాధుర్ తదితరులు పాల్గొన్నారు.